క్లుప్తంగా

18న నిరహార దీక్ష



పెద్దకొత్తపల్లి: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతూ ఈ నెల 18న కొల్లాపూర్‌లో నిరహార దీక్ష చేపడుతున్నట్లు బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు అజయ్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని న్యాయం చేయడం లేదని వాపోయారు. సమావేశంలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి



పెద్దకొత్తపల్లి: ఈ నెల 20న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం ఎదుట గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి కరపత్రాలను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, గ్రామ పంచాయతీ వర్కర్స్ అధ్యక్షుడు బాలస్వామి, రాములు, నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన మట్టి ఇల్లు



పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి మండలంలోని జటప్రోల్‌లో ఎస్సీ కాలనీకి చెందిన సులిగిరి హుస్సాన్‌కు సంబంధించిన మట్టి ఇల్లు గురువారం తెల్లవారుజామున కూలింది. సమయానికి ఇంట్లో ఎవరు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



కల్వకుర్తి రూరల్: బేడ బుడగ జంగాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ గురువారం పట్టణంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు గుమ్మకొండ రాములును బుడగ జంగం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యలను విన్నవించారు. అనంతరం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాసులు, జంబులు, జంబయ్య, వెంకటయ్య, కల్యాణ్, శివ రాములు, నాయకులు వంశీ ఉన్నారు.

శిక్షణకు రాజుయాదవ్ ఎంపిక

కొల్లాపూర్: పట్టణానికి చెందిన తైక్వాండో కోచ్ రాజుయాదవ్ క్యోరిగి విభాగంలో శిక్షణ ఇచ్చేందుకు కోచ్‌గా అర్హత పొందారు. ఏపీలోని విజయనగరంలో నాలుగు రోజులుగా దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తైక్వాండో కోచ్‌లకు అర్హత పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఇరాన్‌కు చెందిన ఒలంపిక్ మెడలిస్టు అబ్బాస్ షేకీ పర్యవేక్షణలో జరిగాయి. పోటీలలో ప్రతిభ కనబర్చిన వారికి కోచ్‌గా శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన అర్హత ధ్రువీకరణ పత్రాలను అందించినట్లు రాజుయాదవ్ తెలిపారు. ఆయనను రాష్ట్ర తైక్వాండో కార్యదర్శి శ్రీహరి, జిల్లా కార్యదర్శి శేఖర్ అభినందించారు.

పొలాలకు వెళ్లేందుకు దారి చూపండి

నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని పుల్జాల గ్రామానికి చెందిన కొంత మంది రైతులు గురువారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పొలాలకు వెళ్లేందుకు దారి లేదని దీంతో ఇబ్బందులు ఏర్పాడుతున్నాయని వివరించారు. పొలాలకు వెళ్లే దారి ప్రస్తుతం అక్రమణకు గురైందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు ఎంబీ పార్వతిదేవి, రమేష్‌కుమార్, సత్యం, రాంచంద్రారెడ్డి, జంగిరెడ్డి, తిరుపతిరెడ్డి, సుభాష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- ఇళ్లపై వేలాడుతున్న తీగలు
- ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు



కోడేరులో ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు



మైలారంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

కోడేరు: మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇళ్లపైనే చేతికి అందె ఎత్తులో తీగలు దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు.

వేలాడుతున్న విద్యుత్ తీగలు

పల్లు గ్రామాల్లో 11 కేవీ విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. చిన్నపాటి వర్షం, ఈదురుగాలులకు తీగలు రాపిడి జరిగి మంటలు చెలరేగగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ వైర్లను తొలగించాలని ప్రజలు అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు మైలారం, నాగులపల్లితండా, నాగుపల్లి, ముత్తిరెడ్డిపల్లి, తుర్కదిన్నె, తదితర గ్రామాల్లో ఇళ్లపైనే విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయి. ఇంటిపైకి వెళ్లేందుకు జంకుతున్నారు. చిన్నారులు ఇళ్లపైకి పంపించేందుకు తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. కొందరు ఇళ్లపైకి వెళ్లి విద్యుత్ ప్రమాదాలకు గురయ్యారని కాని ఇప్పటికి అధికారులు తీగలు మార్చడం లేదని విమర్శలు వినిపిస్తున్నారు.

ఇళ్ల మధ్యనే కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

మండల కేంద్రమైన కోడేరు బీసీ కాలనీ, మైలారం, నాగులపల్లి, నర్సాయిపల్లి, తదితర గ్రామాల్లో ఇళ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. చిన్నపాటు వర్షానికే ఫ్యూజులు కాలిపోయి అంధకారంలో మగ్గాల్సిన దుస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు ప్రమాదాలబారిన పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

మండలంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. త్వరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– ప్రదీప్‌గౌడ్, ఏఈ, కోడేరు

తీగలు తొలగించాలి



మండలంలోని ఇళ్లపై ఉన్న విద్యుత్ వైర్లను తొలగించి ఇళ్లకు దూరంగా ప్రత్యేక లైన్లను ఏర్పాటు చేయాలి. ఇళ్లపై విద్యుత్ తీగలు ఉండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– రఘు, నాగులపల్లి

కంచె ఏర్పాటు చేయాలి



ఇళ్ల మధ్యన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేయాలి. కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళన చెందుతున్నాం. అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– మద్దిలేటి, కోడేరు

అతిథి గృహాలు ఏర్పాటు చేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

దోమలపెంట: నల్లమలకు వచ్చే పర్యాటకుల కోసం అతిథి గృహాలు ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం గ్రామంలో వివిధ అభివృద్ధి కార్యక్రమంలో ఆయాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకుల విడిది కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసిందన్నారు. దోమలపెంటను టూరిజం హబ్‌గా మార్చుతామన్నారు. ఎల్ఎల్‌బీసీ ఇన్‌లెట్ వన్ ప్రాంతాల నుంచి అక్కమహాదేవి గుహలు, కదిలీవనం, దత్తాత్రేయ పాదాలు, ఆక్టోపస్ మరియు వజ్రాలమడుగు ప్రాంతాలకు పర్యాటకులు నది మార్గంలో ప్రయాణించడానికి లాంచీలు సమకూర్చుతామని పేర్కొన్నారు. ఈగలపెంట నుంచి శ్రీశైలం పాతాళగంగ వరకు కారిడార్ బ్రిడ్జి లేక రోప్‌వే నిర్మాణం చేపడుతామన్నారు. అదేవిధంగా దోమలపెంటలోని ఫిల్టర్‌హౌజ్ వద్ద రెండు 40 హెచ్‌పీ మోటర్లకు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డా.అనురాధ, హరినారాయణగౌడ్, ఛత్రూనాయక్, మోయిజ్, గురువయ్య, కుమార్, రవి, ఇంజినీర్లు సుధాకర్‌సింగ్, హేమలత, సీఐటీయూ నాయకులు కిషన్, ఇబ్రహీం, జంగయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం గ్రామంలోని శివాలయం, భక్తమార్కండేయ ఆలయంలో సతీమణి డా.అనురాధతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో రూ.5 లక్షలతో అన్నదాన షెడ్ నిర్మాణానికి, భక్తమార్కండేయ ఆలయ ప్రహరీకి రూ.5 లక్షలు మంజూరు చేస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం పద్మశాలీయులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఆలయాల ర్వాహకులు జంగయ్య, సునీల్, సందీప్, కోటయ్య, తిరుపతయ్య, రాము, రవికుమార్, రమేష్, మల్లీశ్వరి, లక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలి



కల్వకుర్తి రూరల్: మండలంలోని తాండ్ర గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం పట్టణంలో గ్రామస్తులు తహసీల్దార్ ఇబ్రహీంకు ఫిర్యాదు చేశారు. తూకంలో మోసం చేయడంతో పాటు రేషన్ కార్డు దారులకు బియ్యం ఇవ్వకుండా డబ్బులు ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నిసార్లు చెప్పినా పద్ధతి మారడం లేదని మీ ఇష్టం ఉన్న చోట చెప్పుకోండి అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని వివరించారు. పరశురాములు, అశోక్, జాంగిర్, మహేష్, సాయిబాబు తదితరులు ఉన్నారు.

18 నుంచి ఉచిత సాంస్కృతిక శిక్షణ

కొల్లాపూర్: రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల సందర్భంగా విద్యార్థులకు ఉచిత సాంస్కృతిక శిక్షణ శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో ఈనెల 18 వతేదీ నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. విద్యార్థులకు పెయింటింగ్, సంగీతం, కోలాటం, పేరిణీ నాట్యం, నాటక ప్రదర్శనల పట్ల శిక్షణ ఇస్తునట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పేర్లను ఫౌండేషన్ కార్యాలయంలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు సెల్ :9177050558, 8309672607 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నల్లమలలో గాలివాన బీభత్సం



సింగారంలో విరిగిన చెట్టు



ఉప్పునుంతల మండలంలో వరిధాన్యంపై కవర్ కప్పుతున్న రైతులు

అచ్చంపేట రూరల్: నల్లమల ప్రాంతంలో గాలివాన బీభత్సం సృష్టించింది. బుధవారం అర్ధరాత్రి వీచిన ఈదురు గాలులకు మండలంలోని సింగారం గ్రామంలో విద్యుత్‌స్తంభాలు విరిగాయి. సుడిగాలి ధాటికి చెట్లు నేలకొరిగాయి. చెట్ల కింద ఉన్న వాహనాలు ధ్వంసం అయ్యాయి. వర్షానికి వరి, మొక్కజొన్న ధాన్యం తడిసింది. ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

పంటల సాగుపై అవగాహన

కల్వకుర్తి రూరల్: మండలంలోని పంజుగుల గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ ప్రీతి రైతులతో సమావేశం అయ్యారు. ఇందులో భాగంగా పంటల సాగుపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పంటలకు అవసరమైన మేరకే నీరు ఇవ్వాలన్నారు. నేల సంరక్షణ, క్రిమిసంహారక మందులు తగ్గిస్తూ సేంద్రియ ఎరువులు వాడకం మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో నాగేందర్, సాయి వంశీ, పాషా, గ్రామ కార్యదర్శి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సికెల్‌సెల్ వ్యాధిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ప్రదీప్‌కుమార్

వెల్దండ: జన్యులోపంతో సికెల్‌సెల్ వ్యాధి సోకుతుందని జిల్లా సికెల్‌సెల్ నోడల్ అధికారి డాక్టర్ ప్రదీప్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో సికెల్‌సెల్ వ్యాధిపై ఎంఎల్‌హెచ్‌పీలకు, ఏఎన్ఎంలకు, ఆశా కార్యకర్తలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి జన్యుపరమైన లోపం వలన తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందన్నారు. వ్యాధితో బాధపడే వారికి ఎర్రరక్త కణాల జీవితకాలం 120 రోజుల నుంచి 10–20 రోజులకు పడిపోతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం 2047 సంవత్సరం నాటికి సికెల్‌సెల్ వ్యాధి రహితం కోసం కృషి చేస్తుందన్నారు. స్క్రీనింగ్, ప్రాథమిక పరీక్షలు పీఓసీ నిర్వహించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి సింధు, ఏపీఓ నిరంజన్, కల్వకుర్తి డివిజన్ ఉప మలేరియా అధికారి పర్వతాలు, ఎంఎల్‌హెచ్‌పీలు డాక్టర్ నవీన్, యాదయ్య, సాయిపవన్, సూపర్‌వైజర్లు మురళి, కవిత, ఆరోగ్య కార్యకర్తలు లక్ష్మణ్, గోవర్ధన్, ఏఎన్ఎంలు తిరుపతమ్మ, పద్మ, ఎల్లమ్మ, జానకి, చంద్రకళ, పద్మావతి, జహంగీర్‌బి, ఆశా కార్యకర్తలు సుజాత, స్వప్న, యాదమ్మ, వసంత, చంద్రకళ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులను చిన్నచూపు చూడొద్దు

తెలకపల్లి: మానసిక వికలాంగులను చిన్నచూపు చూడొద్దని డిప్యూటీ లీగల్ అధికారి శ్రీరాం అర్యా అన్నారు. గురువారం మండల కేంద్రంలో మానసిక వికలాంగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016 చట్టంపై అవగాహన కల్పించారు. ఎలాంటి వివక్ష చూపినా చట్టం ప్రకారం నేరం మన్నారు. వికలాంగుల ఏదైన సమస్య తలెత్తితే ఉచిత టోల్ ఫ్రీ నంబర్ 14416 ఫోన్ చేయాలని, అదేవిధంగా ఉచిత న్యాయ సలహాకోసం 15100కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అనిత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీను నాయక్

కల్వకుర్తి రూరల్: నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేస్తునట్లు ఆర్డీఓ శ్రీను నాయక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పంజుగుల, ముకురాల వద్ద కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. ధాన్యం తీసుకొచ్చిన రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సరైన తేమశాతం ఉంటే వెంటనే ధాన్యాన్ని తూకం వేసి రైస్ మిల్లులకు పంపించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్ ఇబ్రహీం, సీఈఓ వెంకటరెడ్డి పరశురాం తదితరులు ఉన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించొద్దు

తెలకపల్లి: దళారులకు ధాన్యం విక్రయించి మోసపావద్దని ఆర్డీఓ సురేష్ రైతులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. భూ సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా వరికొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తేమశాతం ఉన్న ఎందుకు కొనలేదని ఐకేపీ సిబ్బందిని ప్రశ్నించారు. ఆయన వెంట తహసీల్దార్ జాకిర్‌అలీ, ఏపీఎం చంద్రయ్య, సీసీ నిరంజన్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ



తాడూరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులకు శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా అధికారి షర్ఫోద్దీన్ సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిక్షణలోని అంశాలను శ్రద్ధగా నేర్చుకొని పాఠశాలలో అమలు చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన



నాగర్‌కర్నూల్ రూరల్: పట్టణంలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చిరు వ్యాపారుల కర్రల కుటీరాలను కూల్చడాన్ని వ్యతిరేకిస్తూ గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. చిరు వ్యాపారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పరశురాం, నాగరాజు, మధు, బాలనాగులు, నాయకులు రాములు, శంకర్, శ్రీనివాసులు, బాలరాజు, భాస్కర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు

వెల్దండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రాజీవ్ యువ వికాస్ ఇంటర్వ్యూలో గురువారంతో ముగిసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మణ్ తెలిపారు. మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు చెందిన 2370 మంది నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకున్నారని 1674 మంది హాజరయ్యారని తెలిపారు. మూడు రోజులుగా వెల్దండ, కల్వకుర్తి ఎస్‌బీఐ, పెద్దాపూర్ కెనరా బ్యాంక్, జూపల్లి, ఇర్విన్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ అధికారులు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా బ్యాంక్ మేనేజర్లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

హోటల్ ఫర్నిచర్ ధ్వంసం

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ హోటల్ ఫర్నిచర్‌ను గురువారం కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. హోటల్ నిర్వాహకుడు తమకు సంబంధించిన పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదనే కారణంతో హోటల్‌లోని ఫర్నిఛర్‌ను ధ్వసం చేశారని అచ్చంపేట ఎస్ఐ రమేష్ తెలిపారు. హోటల్‌కు సంబంధించిన వ్యక్తి కల్పన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలకు అండగా సఖి కేంద్రం



కోడేరు: మహిళలకు అండగా సఖి కేంద్రం ఉందని జిల్లా సఖీ చైల్డ్‌లైన్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని ఎత్తం, మైలారం గ్రామంలో సఖి కేంద్రంపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు, మహిళలు, వృద్ధులు, ఎవరైనా గృహహింస, లైంగిక హింసకు గురైనా తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట గురువారం చలివేంద్రాన్ని కార్మిక శాఖ అధికారి రాజ్‌కుమార్ ప్రారంభించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉంటుందని తెలిపారు.

మట్టి రోడ్డు నిర్మాణ పనులు..

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లి నుంచి పర్వాతాయిపల్లి ప్రధాన రహదారికి వెళ్లేందుకు గురువారం గ్రామస్తులు ప్రారంభించారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హామీ మేరకు మట్టి రోడ్డు పనులు ప్రారంభించినట్లు సీపీఐ నాయకుడు జైపాల్‌రెడ్డి తెలిపారు.

చెక్‌పోస్టు ఏర్పాటు

తిమ్మాజీపేట: నాగర్‌కర్నూల్ జిల్లా ముఖ ద్వారం మరికల్‌లో గురువారం చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సీహెచ్ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా చెక్‌పోస్టు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

హమాలీలుగా అవకాశం ఇవ్వండి

తిమ్మాజీపేట: మద్యం డిపోలో హమాలీలుగా పని చేసేందుకు అవకాశం కల్పించాలని పలువురు నిరుద్యోగ యువకులు గురువారం మండల కేంద్రంలో డిపో మేనేజరుకు వినతిపత్రం అందజేశారు. పనులు దొరకక ఇబ్బంది పడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో దానం బాల్‌రాజ్, ముబారక్, సందీప్, సేవాహగ్, బాలస్వామి, చంద్రయ్య, గబ్బార్, మల్లేష్, పరశురామ్, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు(అండర్‌–19, అండర్‌–23) క్రీడాకారులను గురువారం ఎంపిక చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ ఆధారంగా అండర్‌–19లో 16 మంది, అండర్‌–23లో 16 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేట కోచ్‌లు మహమ్మద్‌మన్నన్, అభిజిత్, రమేష్‌గౌడ్, సతీష్‌లు పాల్గొన్నారు.

సిర్సవాడకు బస్సు పునరుద్ధరించాలి

తాడూరు: కల్వకుర్తి నుంచి సిర్సవాడకు వెళ్లే బస్సు పునరుద్ధరించాలని కోరుతూ గ్రామస్తులు గురువారం డిపో అధికారికి వినతిపత్రం అందించారు. అదే విధంగా నేరుగా హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించారు. మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు అల్లోజి ఉన్నారు.

అతిథి అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న అతిథి అధ్యాపకులు

కందనూలు: అతిథి అధ్యాపకులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు సీనియార్టీ ప్రకారం సర్దుబాటు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కావలి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి వెంకటరమణకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 436 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 12ఏళ్లుగా 1,654 మంది అతిథి అధ్యాపకులు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని తెలిపారు. పెండింగ్‌లో నాలుగు నెలల వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ అధ్యాపకులతో పాటు అతిథి అధ్యాపకులను సీనియార్టీ ప్రకారం సర్దుబాటు చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, అతిథి అధ్యాపక సంఘం నాయకులు బాలకృష్ణగౌడ్, శ్రీను, నాగరాజు, గట్టు విష్ణు, హరిణి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృత్యువాత

బల్మూర్: మండలంలోని కొండనాగుల శివారులో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటుకు ఆవు మృత్యువాత పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రైతు నరేష్ యాదవ్ తన వ్యవసాయ పొలంలో ఎప్పటిలాగే బుధవారం రాత్రి రెండు ఆవులను కట్టెసి ఇంటికి వచ్చాడు.తెల్లవారు జామున పిడుగుపడటంతో ఆవు మృత్యువాత చెందింది. రైతు ఫిర్యాదు మేరకు ఆర్ఐ శివ, పశువైద్య సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు.

సిద్దాపూర్ గ్రామ శివారులో ..

అచ్చంపేట రూరల్: మండలంలోని సిద్దాపూర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు జింకల శ్రీను తన వ్యవసాయ పొలంలో పశువుల పాక వద్ద పశువులను బుధవారం కట్టేసి ఇంటికి వచ్చాడు. గురువారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా పిడుగుపాటుకు ఆవు మృతి చెంది కన్పించింది.